మలేరియా మందులున్నాయి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నివారణకు అవసరమైన మందులు ఉన్నాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. 'మలేరియాకు మందుల్లేవు' అన్న 'ప్రజాశక్తి' కథనానికి మంత్రి స్పందించారు. గత నెల 27న కలెక్టర్, డిఎంహెచ్ఒతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మందులు అందుబాటులో వుంచాలని ఆదేశించినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని పిహెచ్సి, సిహెచ్సిల్లో మలేరియా మందులు అందుబాటులో వుంచాలని సూచించినట్లు చెప్పారు. జ్వరాలతో విద్యార్థులు బాధపడుతున్న హాస్టళ్లలో, ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

జీగిరాం జ్యూట్‌మిల్లును తెరిపిస్తారా?

- మంత్రి హామీపై గంపెడాశతో కార్మికులు
- మూతపడి రెండేళ్లవుతున్నా పట్టించుకోని యాజమాన్యం

మూతపడిన జీగిరాం జ్యూట్‌మిల్

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లాలో గల ఏకైక పరిశ్రమ గత రెండేళ్లుగా మూగబోయింది. సాలూరుకు కూతవేటు దూరంలో ఉన్న జీగిరాం జ్యూట్ మిల్లు మూత పడడంతో కార్మికులు ఆకలితో అలమటిస్తున్న పరిస్థితి ఏర్పడింది. మిల్లు ఉద్యోగమే ఆధారమనుకుని జీవనం సాగిస్తున్న కొంతమంది కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉపాధి అవకాశాల కోసం దూరప్రాంతాలకు వలస పోయారు. మరికొందరు కూలి పనులు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుబండి లాగుతున్నారు. సుమారు రెండేళ్లుగా మిల్లు మూసివేసినా యాజమాన్యం ఇంతవరకు మొండివైఖరితో వ్యవహరిస్తోంది. 1986లో అప్పటి సిఎం ఎన్టీ రామారావు మండలంలోని జీగిరాంలో ఆంధ్రా ఫైబర్స్ లిమిటెడ్ కంపెనీ పేరుతో జ్యూట్ మిల్లును నెలకొల్పారు. గిరిజన నియోజకవర్గం కావడంతో గిరిజనులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా టిడిపి ప్రభుత్వ హయాంలో జ్యూట్ మిల్లును ఏర్పాటు చేశారు. మిల్లు ప్రారంభంలో సుమారు రెండు వేల మంది కార్మికులు పని చేసే పరిస్థితి వుండేది. మిల్లు ప్రారంభంలో ప్రభుత్వ రంగంలో ఏర్పడినా క్రమేణా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. ముడిసరుకు సరఫరా సరిగా లేకపోవడం, పెరిగిన నిర్వహణ వ్యయం వంటి కారణాలతో యాజమాన్యం మిల్లును మూసివేసినట్లు తెలుస్తోంది.

వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం

గత ప్రభుత్వం హయాంలోనే మిల్లు మూతపడింది. సుమారు 1800 కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మిల్లును తెరిపించాలని కార్మిక సంఘం నాయకులు అనేక సార్లు అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆయన మిల్లును తెరిపించడానికి చిత్తశుద్ధితో పని చేయలేదనే అభిప్రాయం అప్పట్లో కార్మికులు వ్యక్తం చేశారు. వేలాది మంది కార్మికుల జీవనోపాధికి సంబంధించిన సమస్యగా భావించి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయడంలో ఆయన విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. కార్మిక సంఘం నాయకులను చర్చలకు పిలిచి యాజమాన్యం హాజరు కాకపోవడం కూడా జరిగింది.

మంత్రి సంధ్యారాణిపైనే ఆశలు

జీగిరాం జ్యూట్ మిల్లును ప్రస్తుత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తెరిపిస్తారనే ఆశతో కార్మికులు ఉన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే మిల్లు స్థాపించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ కార్మికులు టిడిపికి మద్దతుగా నిలిచారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి సంధ్యారాణి కూడా కార్మికులకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ దృష్టికి ఆమె తీసుకెళ్లారు. ఇప్పుడు ప్రభుత్వంలో కీలకమైన మంత్రిగా ఉన్న సంధ్యారాణి మిల్లును తెరిపించి తమ బతుకుల్లో వెలుగు నింపుతారనే ఆశతో కార్మికులు వున్నారు. ఇటీవల మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా కార్మిక సంఘ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అత్యున్నత స్థాయికి ఎటిఎల్ ల్యాబ్‌లు : డిఇఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పాఠశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్చార్జిలతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఇఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పాఠశాలను ఒక ఇన్నోవేషన్ హబ్‌గా చేయాలని సంకల్పంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఎంపిక చేసిన పాఠశాలకు కేటాయించామన్నారు. రూ.25 లక్షలతో రూపొందించిన ఈ ప్రయోగశాలలో విద్యార్థులకు రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, 3డి ప్రింటింగ్ వంటి అత్యాధునిక పరికరాలను అందజేశామని ఆమె తెలపారు. ప్రతి అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పాఠశాల విద్యార్థులను అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లేలా ప్రాజెక్టులను రూపకల్పన చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ డాష్ బోర్డు అప్లోడ్ చేయాలని ఆమె అన్నారు. అంచనాలకు తగ్గట్టుగా పనిచేయని ల్యాబ్స్ మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలను స్వయంగా పరిశీలిస్తామని, ఆ సమయంలో అన్ని రకాల రికార్డులను తనిఖీ చేశామన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పనితీరులో రాష్ట్రంలోనే జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆమె కోరారు. జిల్లా సైన్సు అధికారి జి.లక్షణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ప్రయోగశాలలు నిర్వహణపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చామన్నారు. ఈ ప్రజెంటేషన్‌లో బేయర్స్ కంపెనీ ప్రతినిధిలు యుసిలను ఏ విధంగా అప్లోడ్ చేయాలి, డాష్ బోర్డ్ ఏవిధంగా ఫిల్ చేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అప్యాక్ట్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, బేయర్స్ కంపెనీ ప్రతినిధి విరజాజీ, రాములు, ఎటిఎల్ ల్యాబ్స్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల అమ్మకాలు

పార్వతీపురంరూరల్ : జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రకృతి వ్యవసాయ సాగుచేసే రైతులు పండించే పంటలను అమ్మకాలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ ఎడిఎ శారద, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.షణ్ముఖరాజు తెలిపారు. శుక్రవారం వారు రైతులు తీసుకొచ్చి అమ్మకాలు చేసిన వాటిని ప్రకృతి వ్యవసాయ సాగు ఉత్పత్తులు రైతు ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ తిరుపతి, ఎంటిఎస్‌లు నరసింహ నిర్మల రైతులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు శనివారం స్థానిక పశువైద్య శాలలో ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ దీనకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున పెంపుడు కుక్కల యజమానులు ఈ టీకాలు వేయించి రేబీస్ బారినుండి కాపాడుకోవాలని కోరారు.

జిపిఎస్ పాఠశాలల నుంచి

విద్యార్థులను తరలించొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గిరిజన సంక్షేమశాఖకు చెందిన జిపిఎస్ పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులను బలవంతంగా తరలించడం మానుకోవాలని యుటిఎఫ్, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు సంయుక్తంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థి తనకు నచ్చిన పాఠశాలలో చదువుకొనే హక్కు ఉందన్నారు. కానీ గిరిజన సంక్షేమ అధికారులు తల్లిదండ్రులను బలవంతంగా ఒప్పించి సమావేశాలు పెట్టి తరలిస్తున్నారన్నారు. అలాగే జిపిఎస్ పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయులుంటారని, దీనివల్ల విద్యార్థులకు చదువురాదని తప్పుడు ప్రచారం చేసి విద్యార్థులను తరలిస్తున్నారని అన్నారు. తరలించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారన్నారు. ఎంపిపి ఎస్ ఇతర మేనేజ్మెంట్లలో కూడా ఒక్కరే పని చేస్తున్న పాఠశాలలు ఉన్నాయని, అక్కడ చదువు రావడం లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం జిఒ 117 రద్దుకు ప్రయత్నిస్తుందని, విలీన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ మేనేజ్మెంట్లో ఇటువంటి గిరిజన విద్యారంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకురావడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని విరమించుకోకపోతే గిరిజనులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, పండు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శు టి రమేష్, ఎస్ మురళీమోహనరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అవినాష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఊటనీరే తాగునీరు

- దిష్టిబొమ్మలా రక్షిత ట్యాంకు
- తాగునీటికి బాగుజోల గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

అక్కడి రక్షిత మంచినీటి పథకం దిష్టిబొమ్మలా దర్శనమిస్తుంది. ఇంటింటి కుళాయిలు పరిస్థితి కూడా అంతే. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మించినా బోరుబావి నుంచి మాత్రం నీటి కనెక్షన్ లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. దీంతో ఎండైనా, వానైనా కొండ నుంచి వచ్చే ఊట నీరే అక్కడి గిరిజనులకు దిక్కు. ఇది పనసభద్ర పంచాయతీ పరిధి బాగుజోల గిరిజనుల దుస్థితి.

సుమారు 26 కుటుంబాలు నివసించే ఈ గిరిజన గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. పేరుకు రక్షిత పథకం ఉన్నా, దాని వల్ల ప్రయోజనం మాత్రం సున్నానని గిరిజనులు వాపోతున్నారు. బోరు పాడై వారం రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. ఇంటింటికీ కుళాయిలంటూ రెండున్నరేళ్ల క్రితం నిర్మించినప్పటి నుంచి చుక్క నీరు సరఫరా కూడా లేదని గ్రామ పెద్ద కొండ తామరదొర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టరు బిల్లులు చేసుకోవడానికి తప్ప ఇంటింటికీ కుళాయి పథకం పనిచేయలేదన్నారు. మంచినీటి పథకం కొద్ది రోజులుగా పనిచేసినప్పుడు బోరు నీరు నేరుగా పైపులు తీసుకుని ఊరంతా ఒకే చోట పట్టుకునే వాళ్లమని తెలిపారు. కొద్ది రోజులుగా మోటారు పోయిందో లేక విద్యుత్ సరఫరా లేదో తెలియదని కానీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో కొండ ఊటనీరే తాగునీటికి, ఇతర అవసరాలకు వాడుకోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో గెడ్డనీరు తాగడంతో తరచూ గ్రామస్తులు రోగాలు బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఊటనీరు పడుతున్న బాగుజోల గిరిజన మహిళలు

ఎపిపిఎస్‌సిలో పాలకొండ వాసి ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎపిపిఎస్‌సి ఫలితాల్లో పాలకొండ పట్టణానికి చెందిన కె.మణికృష్ణ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆయన తండ్రి కె.జనార్ధన్ గురూజీ మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి, సోదరి ఐఐఐటి నూజివీడులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మణికృష్ణ స్వగ్రామైన నడిమికెల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుండి 5 వరకు, 6 నుండి 10 వరకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి వెన్నెలవలస పాఠశాలలో చదివి ప్రభుత్వ కొలువు సాధించడం గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా మణికృష్ణ మాట్లాడుతూ తన తండ్రి ప్రేరణ, తల్లి దీవెనతో ప్రకృతి సంపదలైన వృక్షాలకు, మూగ జీవాలకు సేవచేసే ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం రావడం ఆనందదాయకమని తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తలవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, ఎపిజిఇఎ కార్యదర్శి ఎన్. భరత్ భూషణ్, గ్రంథాలయ అధికారి గణేష్‌బాబు మణికృష్ణకు అభినందనలు తెలియజేశారు.

మణికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

మహిళలకు 'చేయూత' నగదు ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మహిళలకు చేయూత నగదు రూ.18,750 ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ పాత ప్రభుత్వం మహిళలందరికీ చేయూత డబ్బులు నాలుగో విడత రూ.18,750 విడుదల చేసిందని, అతి తక్కువ మందికి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయని, అన్నారు. ఎక్కువ మంది మహిళలకు చేయూత డబ్బులు జమ కాలేదన్నారు. అర్హులందరికీ చేయూత డబ్బులు ఇప్పటికైనా ప్రభుత్వం జమ చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎఒ ఎ.వేణుగోపాలరావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు గెద్ద తులసి, భౌరోతు గౌరమ్మ, దాసరి మంగమ్మ, బెలగాం రమణమ్మ, విజయ్ గౌరీ, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మహిళలకు చేయూత నగదును వారి ఖాతాలో జమ చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం చేయూత లబ్ధిదారులతో స్థానిక బిసి కాలనీ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమరాడలో సుమారు 70 మందికి పైగా జగనన్న చేయూత పథకం ద్వారా అందాల్సిన రూ.18750 అందక ప్రతిరోజు బ్యాంకులు, సచివాలయం, వెలుగు కార్యాలయాల చుట్టూ పనులు మానేసి తిరుగుతున్నారన్నారు. తక్షణమే వెలుగు అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న విఒఎల ద్వారా చేయూత పథకం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 10లోగా ఈ సమస్య పరిష్కరించపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

యుపిహెచ్‌సిల్లో రెగ్యులర్ వైద్యులను నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ పరిధిలో గల జగన్నాధపురంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)లో రెగ్యులర్ వైద్యులను నియమించాలని శుక్రవారం పట్టణ సిపిఎం నాయకులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి విజయ పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు మాట్లాడుతూ జగన్నాధపురం యుపిహెచ్‌సికి ప్రతిరోజు 50 నుంచి 100 మంది వరకు రోగులు ఓపి విభాగంలో తమ అనారోగ్య సమస్యలపై వస్తున్నారన్నారు. వీరిని పరీక్షించేందుకు డాక్టరు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుత డెప్యుటేషన్‌పై వేసిన వైద్యాధికారి డాక్టర్ ఎన్వి విద్యాకుమార్ అందుబాటులో ఉండడం లేదన్నారు. కావున రోగులకు ఇబ్బంది లేకుండా రెగ్యులర్ డాక్టర్ని నియమించాలని కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని అన్నారు.

మేము ఎమ్మెల్యే తాలూకా!

ప్రజాశక్తి-పాలకొండ

రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. పాలకొండలో కూడా జనసేన తరపున నిమ్మక జయకష్ణ ఎమ్మెల్యేగా గెలిచారు. మొన్నటి వరకు టిడిపిలో ఉన్న జయకృష్ణ చివరి నిమిషంలో జనసేన టికెట్ సంపాదించి ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం జయకృష్ణకు మేము మద్దతుదారులమంటే మేము మద్దతుదారులమంటూ హడావిడి చేస్తున్నారు. రాజకీయంగా సంబంధం లేని వ్యక్తులు కూడా తాము జయకృష్ణ తాలుకా అంటూ హడావిడి సృష్టిస్తున్నారు. జయకృష్ణకు మొదటి నుండి మద్దతుగా కొంతమంది నేతలున్నప్పటికీ ఇప్పుడు మాత్రం కొత్తగా కుప్పలు తెప్పలుగా తాము మద్దతుదారులమంటూ కొంతమంది హడావుడి చేస్తున్నారు. మా వల్లే జయకృష్ణ గెలిచారంటే కాదు మా వల్లే గెలిచారంటూ ఊదరగొడుతున్నారు. సోషల్ మీడియాలో జయకృష్ణకు వ్యతిరేకంగా గతంలో పోస్టులు పెట్టిన వారు ఆయన గెలుపు తర్వాత తమ వల్లే జయకృష్ణ గెలిచారంటూ ప్రచారం మొదలుపెట్టారు. అదేవిధంగా జయకష్ణకు వ్యతిరేకంగా టికెట్ ఆశించి రాజకీయాలు చేసిన వారు కూడా ఈయన గెలుపు తర్వాత తమ మద్దతుతోనే జయకృష్ణ గెలుపు సాధ్యమైందని చెప్పుకోవడం పట్ల ప్రజలే నోరెళ్లబెడుతున్నారు. తాము జయకష్ణ మనుషులమంటూ అధికారుల మీద వీరు హడావిడి ప్రారంభించారు. దీంతో అధికారులు కూడా గుబులు చెందుతున్నారు. అయితే జయకృష్ణకు ఈ విషయం తెలుసో లేదో అనేది కూడా అధికారులకు, సామాన్యులకు అంతుపట్టని విషయంగా మారింది. ఏది ఏమైనా జయకృష్ణ వైఖరి ఎలా ఉంటుంది, ఎవరెవరు ఆయన మద్దతుదారులు అనేది నిర్దిష్ట వైఖరి వస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదని చెప్పచ్చు.

అనుమతుల్లేని చేపల చెరువులకు నోటీసులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అనుమతులు లేకుండా చేపల చెరువులు పెంపకం చేపట్టకూడదని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మత్స్య శాఖ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో జరుగుతున్న చేపల పెంపకం సాగుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జెసి సుస్థిరమైన చేపల పెంపకం కోసం కొరకు కాలుష్యం, వ్యర్థాలు లేకుండా రైతులు తమ స్వంత భూమిలో పెంపకం చేపట్టాలని తెలిపారు. చేపలు సాగు చేపట్టే రైతులు మత్స్యశాఖ, వ్యయసాయశాఖ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, రెవెన్యూ శాఖలతో ఏర్పాటుఅయిన (డిస్ట్రిక్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ) ద్వారా అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చేపల పెంపకం చేయాలన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి మాట్లాడుతూ పాచిపెంట మండలం విశ్వనాధపురంలో కేవలం ప్రొవిజనల్ పర్మిషన్ మాత్రమే (చెరువు త్రవ్వుటకు మాత్రమే) పొంది, ఫైనల్ పర్మిషన్ లేకుండా, దేవాదాయఖ భూమి సర్వే నెం. 14/1లో 2.80 ఎకరాలు, 12/1లో 6.80 ఎకరాలు ఆక్రమించి చేపల సాగుచేస్తున్న ఆర్‌పి భంజ్‌దేవ్‌దేవ్ చేస్తున్న చేపల పెంపకం అనధికారమైందని, సదరు భూమికి చట్టపరమైన హక్కుదారులు కారని నిర్ధారించినట్టు తెలిపారు. హై కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం 15 రోజుల్లోగా పై ఆ స్థలాన్ని ఖాళీ చేసి, పాచిపెంట తహాశీల్దార్‌కు అప్పగించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో వ్యయసాయశాఖ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇండస్ట్రీస్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కంబరలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జి.హేమ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వరిని అభినందిస్తున్న వీరేష్‌చంద్రదేవ్, టిడిపి నాయకులు

ఇది ప్రజా విజయం

అభినందన సభలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

ఇది ప్రజా గెలుపని... మీరుంటేనే నేనున్నానని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి తన గెలుపునకు అహర్నిశలు కృషి చేశారని, వారందరికీ తాను రుణపడి ఉండి అండగా ఉంటానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కురుపాంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్వరి విజయోత్సవ ర్యాలీ, సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా ధూళికేశ్వరస్వామి ఆలయం దగ్గర ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి నుంచి ఆశీర్వదించిన ప్రజలకు అభివాదం చేసుకుంటూ మహిళలు హారతులు, పూలు మాలతో పలు వీధుల్లో స్వాగతం పలికారు. సాయిరాం గుడి ఎదురు మైదానం జరిగే సభా వేదిక వరకు ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన సభలో కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిందని, కార్యకర్తలు, నాయకులు విజయోత్సవ ర్యాలీలో భాగస్వాములు కావడం పండగ వాతావరణంగా తలపించిందన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధికి మారుపేరుగా తయారు చేయాలనేదే నా కోరిక అని అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు తయారు చేసుకుని అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. విజయోత్సవ ర్యాలీ అనంతరం అభినందన సభలో ఎమ్మెల్యే జగదీశ్వరిని వీరేష్ చంద్రదేవ్, నియోజకవర్గంలో గల పలు మండలాల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కద్రక మల్లేష్, ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకులు కోలా రంజిత్ కుమార్, చందక రామకృష్ణ, కర్రి శ్రీను, నందివాడ కృష్ణబాబు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, జనసేన నాయకులు నేరడబెల్లి వంశీ, గౌరీ, శ్రీకర్, ఐదు మండలాల టిడిపి కన్వీనర్లు కెవి కొండయ్య, అక్కేన మధు, శేఖర పాత్రుడు, పి.రాంబాబు, పాడి సుధ ఐదు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువలో పూడికలు తీస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి నిధులతో జంఝావతి కాలువ అభివృద్ధి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉపాధి హామీ నిధులతో జంఝావతి కాలువ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గడిచిన కొద్ది సంవత్సరాల నుంచి మండల పరిధిలోని ఆయా గ్రామాల భూములకు సాగునీరందించే జంఝావతి కాలువలు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో మండల పరిధిలోని ఉల్లిభద్ర, తులసిరామి నాయుడువలస, గొల్లవానివలస, గొట్టివలస, గరుగుబిల్లి తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం ఉపాధి హామీ నిధులతో కాలువల్లోని తుప్పలు, డొంకలు తొలగించేందుకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం గొట్టివలస పంచాయతీ పరిధిలోని జంఝావతి కాలువ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని ఫీల్డ్ అసిస్టెంట్ నల్ల సూర్యనారాయణ తెలిపారు.

మాజీ సిఎం జగన్ తీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వంపై ఇచ్చిన తీర్పుతోనైనా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బుద్ధి తెచ్చుకోలేదని, ఆయన తీరు చూస్తే అర్ధమవుతుందని, ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శుక్రవారం కృష్ణపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇవిఎంల పట్ల ప్రవర్తించిన తీరును ప్రపంచం మొత్తం చూసి తప్పుపట్టినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి ఆయన్ను సమర్థిస్తూ మాట్లాడడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని సంస్థలను నిర్వీర్యం చేసి అభివృద్ధిని 20 ఏళ్లు వెనక్కు తీసుకెళ్లిన ఆయనకు ప్రజలు ఇచ్చిన తీర్పు శరాఘాతం అన్నారు. నిన్న పిన్నెల్లిని పరామర్శించిన అనంతరం ఆయన చంద్రబాబును హెచ్చరిస్తూ ఆడిన మాటలు రాష్ట్ర ప్రజలు యావగించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు తన తీరును మార్చుకొని ప్రజల అభీష్టం మేరకు అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు.

కుసిమిలో స్టాప్ ది డయేరియా

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని కుసిమిలో స్టాప్ ది డయేరియా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రజలు, వైద్య సిబ్బంది, అధికారులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డయేరియా, మలేరియా, ఇతర వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈవ్యాధులు వస్తే ఎలా ఎదుర్కోవాలో తెలిపారు. ఈ సందర్భంగా అంతా అప్రమత్తంగా ఉండాలని, వైద్య సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అనంతరం సచివాలయంలో గ్రామసభ నిర్వహించి, గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఒ ప్రభాకర్, ఎంపిడిఒ కె.గీతాంజలి, సర్పంచ్ సవర కూర్మారావు, ఎంపిటిసి గణేష్, ఇఒపిఆర్‌డి కె.సత్యం, వైద్యాధికారి బి.రవీంద్ర, కార్యదర్శి రాజశేఖర్, గిరిజనులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావును సన్మానిస్తున్న ప్రసాదరావునాయుడు

వికలాంగుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - మక్కువ

వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారి అభ్యున్నతికి కృషి చేస్తూ ముందుకు సాగాలని టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు అన్నారు. శుక్రవారం మన్యం జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన పొట్నూరు నారాయణరావును ఆయన తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ నాయకునిగా ఎన్నిక కావడం శుభ పరిణామమని, అయితే మరింత బాధ్యత తనపై ఉందన్న విషయాన్ని గుర్తించుకొని ముందుకు సాగాలని నారాయణరావుకు సూచించారు. సంఘటితంగా అందర్నీ కలుపుకుంటూ వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు టిడిపి కార్యకర్తలు, వికలాంగులు పాల్గొని కేక్ కట్ చేశారు.

విద్యార్థులకు యూనిఫాంలను అందజేస్తున్న ఎంఇఒ

స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రభుత్వం అందచేస్తున్న స్టూడెంట్స్ కిట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి1 సామల సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చిన్నారులకు యూనిఫాం వస్త్రాలు, బూట్లు తదితర స్టూడెంట్ కిట్లను ఎంఇఒ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, షూస్, యూనిఫామ్ మొదలైనవన్నీ ఉచితంగా అందజేస్తున్నారని, వీటిని విద్యార్థులు వినియోగించుకుని చక్కగా చదువుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జానుములవలస, కోట సీతారాంపురంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టాలని ఇప్పటికే తెలియజేశామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోట సీతారాంపురంలో కాలువల్లో తీసుకున్న పూడికలు

రేషన్ పరేషన్

- ఆరు నెలలుగా అందని కంది పప్పు
- పంచదార పరిస్థితీ అంతే

ప్రజాశక్తి - సీతంపేట

పౌరసరఫరాల శాఖ ద్వారా ఉచిత బియ్యం, పప్పు, పంచదార, నిత్యవసర సరుకులు సబ్సిడీలో రేషన్ కార్డ్ లబ్ధిదారులకు అందజేస్తున్నామని, దీనికోసం కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఇంటి వద్దకే రేషన్ అందిస్తున్నమని ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నాయి తప్ప ఆచరణలో లబ్ధిదారులెవరికీ సక్రమంగా సరుకులు అందడంలేదు. కేవలం కార్డులో ఉన్న సంఖ్య ప్రకారం ప్రతి మనిషికి ఐదు కేజీల చొప్పున ఇవ్వడం తప్ప మిగిలిన సరుకులేవీ అందించడంలేదు. దీంతో సరిపడా బియ్యం అందక, నిత్యవసర సరుకులైన కందిపప్పు, పంచదార తదితర సరుకులు అరకొర సరఫరా చేసినప్పటికీ నెలనెలా అందకపోవడంతో బయట మార్కెట్లో ఉన్న ధరలు ఆకాశానికి అంటడంతో నిరుపేదలు బయట మార్కెట్లో కొనుగోలు చేయలేక ప్రభుత్వం సరిపడినన్ని సరుకులు సరఫరా చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట ఏజెన్సీలో తెల్ల రేషన్, అంత్యోదయ కార్డులు 16, 269 ఉన్నాయి. ఉచిత బియ్యం 565 టన్నుల 447 కేజీలు బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే ఆరు నెలలుగా కందిపప్పు అందకపోవడంతో లబ్ధిదారులూ ఆందోళన చెందుతున్నారు. జనవరిలోనే కందిపప్పు అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పౌర సరఫరాశాఖ నుంచి సరుకులు సరఫరా కాలేదు. అయితే ఏప్రిల్‌లో రాగిమాల్ట్ ఒక నెల మాత్రమే కార్డుదారునికి సరఫరా చేశారు. అది కూడా అరకొర సరఫరా చేయడంతో పూర్తి స్థాయిలో కార్డుదారులందరికీ అందలేదు. మే ఒక నెల మాత్రమే కిలో గోధుమపిండి అందజేశారు. ఇది కూడా అరకొరగానే సరఫరా చేయడంతో ఎవరికీ పూర్తిస్థాయిలో అందలేదు. చాలీచాలని రాగి మాల్ట్, గోధుమపిండి రావడంతో ఎవరికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక సేల్స్‌మెన్లకు తలనొప్పిగా మారింది. ఇక ఈ నెల ఇచ్చిన అరకేజీ పంచదారను విక్రయిస్తుంది. పేదలకు కనీసం నిత్యవసర సరుకులు కూడా సబ్సిడీపై ఇవ్వలేకపోతున్నారని వాపోతున్నారు. దీనిపై సివిల్ సప్లై డిటి మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా నిత్యవసర సరుకుల్లో భాగంగా పంచదార, ఇతర వస్తువులు ప్యాకెట్‌లో తేడా ఉండడంతో కాంట్రాక్టుకు ఉన్నతాధికారులు నిలిపివేయమన్నారని అందుకే పంచదార నిలిచిపోయిందని సమాధానం ఇచ్చారు.

నిత్యావసర సరుకులు సరఫరా చేయాలి

పౌరసరఫరా శాఖ నిత్యావసర సరుకులైన కందిపప్పు, పంచదార, పామాయిల్ సబ్సిడీపై ప్రతినెలా రేషన్ కార్డ్ లబ్ధిదారులకు అందజేయాలి.

మండంగి కాంతారావు,
సిఐటియు నాయకులు సీతంపేట

అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదల

విజయనగరం : అగ్నిపథ్ పథకంలో భాగంగా భారతీయ వాయుసేనలో అగ్నివీర్(వాయు) నియామకాల కోసం కమాండింగ్ ఆఫీసర్, 12 ఎయిర్‌మెన్ సెంటర్, సికిందరాబాద్ నుంచి నోటిఫికేషన్ విడుదల అయినట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. ఇంటర్మీడియెట్ ఎంపిసి గ్రూపులో లేదా పాలిటెక్నిక్ లేదా ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇంగ్లీషు సబ్జెక్టులోనూ అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అభ్యర్థులు 2004 జులై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య మధ్య జన్మించిన వారై వుండాలని తెలిపారు. అగ్నివీర్(వాయు)లో నియామకం కోసం స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు జూలై 8నుంచి 28వ తేదీలోగా https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఆన్‌లైన్ పరీక్ష అక్టోబరు 18న జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు రూ.550 పరీక్ష రుసుం, దీనికి అదనంగా జిఎస్‌టి ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. .

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో శుక్రవారం పోలీసులు నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ విధి నిర్వహణలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. టౌన్ సిఐ వాసు నాయుడు ఆధ్వర్యాన పట్టణ పోలీసులు గంట వ్యవధిలోనే 20 నెంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపరాదని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ కెవి సురేష్ పాల్గొన్నారు.

కూల్చివేతకు గురైన మరుగుదొడ్డి

మరుగుదొడ్డి కూల్చివేతపై చర్యలేవీ?

చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలోని గుమడాంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పక్కనున్న సామాజిక మరుగుదొడ్డిని కూల్చివేయడంపై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. రూ.3.5లక్షలతో నిర్మించిన మరుగుదొడ్డిని కొద్దిరోజుల క్రితం కొంతమంది ఉద్దేశపూర్వకంగా కూల్చివేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న సామాజిక మరుగుదొడ్డి తమ ఇళ్లకు దగ్గరలో ఉందన్న కారణంతో కూల్చివేసి ఉంటారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం నేరమని తెలిసినా ఆ పని చేశారంటే అందుకు తగిన పలుకుబడి ఉన్నవారే ఆ పని చేసి వుంటారని తెలుస్తోంది. మరుగుదొడ్డి కూల్చివేతపై మున్సిపల్ అధికారులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూల్చివేసిన వారెవరో నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే టౌన్ సిఐ వాసు నాయుడు కూడా మున్సిపల్ అధికారులకు తిరిగి లేఖ రాశారు. కూల్చివేతకు సంబంధించిన ఆధారాలు ఏమైనా వుంటే తెలియజేయాలని ఆ లేఖలో కోరారు. మరమ్మతులకు గురైన ఆ సామాజిక మరుగుదొడ్డి చాలా కాలంగా వినియోగంలో లేదు. జెసిబి సాయంతో రాత్రికి రాత్రే కూల్చివేసి ఉంటారనే గుసగుసలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా కౌన్సిలర్లు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. సామాజిక మరుగుదొడ్డి కూల్చివేసి ఇన్నాళ్లయినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీసులతో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూడాలని కౌన్సిలర్లు సమావేశంలో డిమాండ్ చేశారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా : అలజంగి

ప్రజాశక్తి - సీతానగరం

పార్టీకి వెన్నుముకగా నిలుస్తూ వస్తున్న ప్రతి వైసిపి కార్యకర్తకు పార్టీతో పాటు తానూ ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గత ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు సమీక్షించి లోటుపాట్లను సరిచేసుకుని ముందుకు సాగుదామన్నారు. మండలం వైసిపి కార్యకర్తలతో సమీక్షా సమావేశం శుక్రవారం వైసిపి సీనియర్ నాయకులు ఆర్‌వి స్వగృహంలో జరిగింది. ఈ సందర్భంగా జోగారావు సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఓటమి వల్ల ఏ ఒక్క వైసిపి ప్రజా ప్రతినిధులు కానీ, నాయకులు కానీ ప్రజలను చూసి తలదించుకునే పరిస్థితి లేదని, అవినీతి రహిత పాలన అందించామని, ఎవరూ అధైర్య పడవద్దు అని అన్నారు. ఓటమికి గల కారణాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించి ప్రజల తరపున పోరాడి వారికి తోడుగా నిలిచేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని నాయకులు, కార్యకర్తలు అన్నారు. సమావేశంలో జడ్పిటీసీ మామిడి బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, సీరియల్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, పోల సత్యనారాయణ, సిడిసి మాజీ ఛైర్మన్ ఎంఎన్ రామకష్ణ, మండల మహిళా అధ్యక్షులు దాసరి నాగమణి, సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మన్యం జిల్లా పాచిపెంట మండలం కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ అప్పలరాజును సస్పెండ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సహేతుకమైన కారణాల్లేకుండా గిరిజన విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు టిసిలు ఇచ్చి ఇళ్లకు పంపుతున్నారని తెలిపారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా ప్రిన్సిపల్ వ్యవహారం ఉందన్నారు. అలాగే గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులను అవమానించారని తెలిపారు. ఇటువంటి ప్రిన్సిపల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, గిరిజన విద్యార్థులకు నష్టం జరిగేలా టిసిలు ఇస్తున్న ప్రిన్సిపల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అదనపు సీట్లకు నోచుకోని గిరిజన విద్యార్థులు

ప్రతి ఏటా జూన్ నాటికి గిరిజన గురుకుల కళాశాలల్లో అదనపు సీట్లు కేటాయింపు చేసి భర్తీ చేసే వారని, కొత్త ప్రభుత్వంలో ఈ ఏడాది నేటికీ అదనపు సీట్లు కేటాయించకుండా నిర్లక్ష్యంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల శాఖ అధికారులు వ్యవహరించడంతో పది పాసైన గిరిజన విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారని రంజిత్ కుమార్ అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంటింటికి నేరుగా రేషన్ సరుకులు అందించాలని కోరారు. స్థానిక వైటిసిలో ఏర్పాటు చేసిన గర్భిణుల వసతి గృహం సిబ్బందికి 18 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేక పాఠ్యాంశాల బోధన నిలిచిందని రంజిత్ కుమార్ అన్నారు. అలాగే ఐటిడిఎ పిఒ ఆధ్వర్యాన గ్రీవెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పశువులకు టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - భామిని

వర్షాకాలంలో పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల నివారణకు వాక్సిన్లు తప్పనిసరి అని భామిని పశు వైద్యులు బి.సంతోష్ కుమార్ తెలిపారు. భామిని మండలంలోని కీసర, కొసలిలో పశువులకు శుక్రవారం వాక్సిన్ కార్యక్రమం పశు వైద్యులు, గోపాల మిత్రలు చేపట్టారు. ఆవులు, గేదెలకు గొంతు వాపు, జబ్బ వాపు రాకుండా హెచ్‌ఎస్ బి క్యు వాక్సిన్ వేయాలని, గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి వల్ల స్వల్ప కాలంలో చనిపోయే అవకాశం ఉందని, ఈ వ్యాధి నివారణకు ఈటి వాక్సిన్ వేయాలని, నీలి రంగు నాలిక వ్యాధికి బ్లూ టంగ్ వాక్సిన్ వేయాలని, పశువులు, మేకలు, గొర్రెల్లో వచ్చే ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నివారణకు ఎఫ్‌అండ్‌ఎం వాక్సిన్ వేయాలని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ వాక్సిన్లను పాడి రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. మండలంలో సుమారు 5 గ్రామాల్లో వాక్సిన్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో గోపాల మిత్ర పాల్గుణరావు పాల్గొన్నారు.

గంగన్నదొరవలస పాఠశాల నిర్మాణమెప్పుడో?

ప్రజాశక్తి - సాలూరురూరల్

పునాదులకే పరిమితమైన పాఠశాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

మండలంలోని గంగన్నదొరవలస పాఠశాలను విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు మార్చిపోయినట్లు ఉన్నారని, పాఠశాల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందనివ్యవసాయ కార్మికసంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్కూల్ కమిటీ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 18 నెలలుగా ఈ పాత భవనాన్ని తొలగించి నాడు-నేడు కింద సుమారు రూ.35 లక్షలు మంజూరయ్యాయని, అవి ఏమైపోయాయో అర్థం కావడం లేదని అన్నారు. ఈ పాఠశాలకు సుమారు 5 గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారని, ఇక్కడికి వచ్చిన విద్యార్థులకు భవన సదుపాయం లేక గ్రామంలో ఉన్న రెండు, మూడు ఇళ్ల గడపల్లో తరగతులు నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత విద్యా సంవత్సరంలో ఎంఇఒను పాఠశాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించినా, ఆయన నుంచి సరైన సమాధానం లేదన్నారు. గత విద్యాసంవత్సరంలో సుమారు 40 మంది పిల్లలు ఉండేవారని, ఇక్కడ సరైన సదుపాయం లేక ఇప్పుడు 28 మంది పిల్లలు మాత్రమే ఉన్నారని దీనంతటికీ కారణం ఇక్కడ సరైన సదుపాయం లేకపోవడమేనని అన్నారు. ఆర్థిక స్థోమత ఉన్న కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపిస్తున్నారని, మిగతా నిరుపేద గిరిజన పిల్లలు మాత్రమే ఇక్కడే చదువుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం వల్ల ఈ గ్రామ పాఠశాలకు మోక్షం కలగలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణాన్ని త్వరగా చేపట్టి గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, వంతల సుందరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

పట్టణంలోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తమ చాంబర్‌లో స్టాప్ డయేరియా కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో డ్రైన్ డీసిల్టింగ్ డ్రైవ్ పనులతో పాటు యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ పూర్తిస్థాయిలో జరిగేలా సంబంధిత సెక్రటరీలు పూర్తి బాధ్యత వహించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలకు సూచించారు. 5ఏళ్లలోపు పిల్లలకు జింక్ సల్ఫేట్ టాబ్లెట్లను వారి కుటుంబ సభ్యులకు అందజేసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, వేడి నీటిని మరిగించి వడగట్టి తాగాలని సూచించాలని హెల్త్ సెక్రటరీలకు తెలిపారు. ప్రతి రోజు ఎమినిటీ సెక్రటరీలు తాగునీటి సరఫరా సమయంలో క్లోరినేషన్ పరీక్షలు చేయాలని, పైప్ లైన్ లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు ప్రారంభించాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ డిఇ పి.కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ మురళి, ఎఎస్ఒ వీరి నాయుడు, ఎమినిటీ, హెల్త్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దిగుబడి పెంచడమే వ్యవసాయ శాఖ లక్ష్యం

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సరైన సమయానికి పంటల్లో సరైన సూచనలు అందజేసి సాగు ఖర్చును తగ్గిస్తూ దిగుబడి పెంచడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ పనిచేస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కోస్టువలసలో రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన, అధిక పంట దిగుబడులు సాధించాలంటే వ్యవసాయ భూమి ఆరోగ్యంగా ఉండాలని, ఎలాంటి పోషక లోపాలు లేకుండా భూమిలో సేంద్రియ కర్బన శాతం ఒక కంటే ఎక్కువ ఉండాలని, కానీ ప్రస్తుతం 0.01శాతం కంటే తక్కువగా ఉండడం వల్ల పంటల్లో దిగుబడులు ఘననీయంగా తగ్గిపోతున్నాయి. అధిక పంటల దిగుబడికి రసాయన ఎరువుల మీద ఎక్కువగా ఆధార పడాల్సి వస్తుందని అన్నారు. కాబట్టి సేంద్రియ ఎరువులను రసాయన ఎరువులతో కలిపి సమతుల్యంగా వాడుకోవాలని, మట్టి నమూనాల ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులు వేసుకోవాలని తెలిపారు. కలుపు మందులు వినియోగం తగ్గాలంటే దమ్ముకు పంటదమ్ముకు మధ్య ఐదు రోజులు వ్యవధి ఉండాలని, అప్పుడే కలుపు సమస్య పూర్తిగా తగ్గుతుందని, కలుపు మందులు ఎక్కువగా వాడడం వల్ల ఆరుద్ర పురుగులు, వానపాములు వంటి అనేక ఉపయోగకరమైన పురుగులు నశించిపోతున్నాయని అన్నారు. కాబట్టి రసాయన గుళికలు, రసాయన కలుపు మందులు వినియోగం పూర్తిగా తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్. రైతులు పాల్గొన్నారు.

భూమిని సారవంతం చేసుకోవాలి

గరుగుబిల్లి : మండలంలోని ఖడ్గవలస, లఖనాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా చేస్తున్న రైతులు వేసుకొన్న నవ ధాన్యాల సాగును ఆర్‌వైఎస్‌ఎస్ ట్రాన్స్ఫర్మేషన్ సభ్యులు ఎస్.రాజారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులంతా తప్పనిసరిగా భూమిని సారవంతం చేసుకోవడానికి నవధాన్యాలు వేసుకోవడం 20 నుంచి 30 రకాల విత్తనాల

పాచిపెంట : రైతులకు సూచనలు ఇస్తున్న ఎఒ తిరుపతిరావు

వల్ల బహుళ ప్రయోజనం కలుగుతుందని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని, కావున ప్రతి రైతు తప్పనిసరిగా వేసుకునేలా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రణాళికలు తయారు చేసి, సిబ్బందితో, రైతుల సహకారంతో అమలు చేస్తామన్నారు. ఇలా చేయడం వల్ల ఏ విధమైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదని, ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, పురుగులు, తెగుళ్లను తట్టుకొనే సామర్థ్యం ఉంటాయని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించడం వల్ల వినియోగదారులకు, ఉత్పత్తిదారులకు సమిష్టి ప్రయోజనం కలుగుతుందని, రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ వుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిండడం మంచి శుభ పరిణామమన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడు రాష్ట్రం, దేశం, పురోగాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎ జి.అన్నపూర్ణ, దేవీ ప్రసాద్, రైతులు సత్యనారాయణ, శరత్, పోలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఇఒల సమస్యల పరిష్కారానికి డిఇఒ హామీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో పని చేస్తున్న ఎంఇఒ-1లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ హామీ ఇచ్చారని ఎంఇఒ- 1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. శుక్రవారం అసోసియేషన్ జిల్లా నాయకులు ఎన్.నాగభూషణరావు, డి.గౌరునాయుడుతో కలిసి డిఇఒకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎంఇఒ కార్యాలయాల నిర్వహణా నిధులు గత ఏడాది నుంచి విడుదల చేయకపోవడం వల్ల ఆఫీస్ నిర్వహణా ఖర్చులు ఎంఇఒలే భరించాల్సి వస్తోందన్నారు.ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఎంఇఒ కార్యాలయాలుగా ఉన్న మండల వనరుల కేంద్ర భవనాలు చాలావరకు శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో ఆధునీకరణకు తగిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని కోరామన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిఇఒ హామీ ఇచ్చారని తెలిపారు.

ఎదురెదురుగా ఆటోలు ఢీ.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం వైకెం నగర్ శివారు ఎత్తు కానా దగ్గర శుక్రవారం ఎదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న కొమరాడకు చెందిన షణ్ముఖరావు కుడి చేతికి గాయాలయ్యాయి. దీంతో స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

26 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కటారి కోట వద్ద 26 లీటర్ల నాటు సారాను తరలిస్తున్న ఎర్రజన్ని లచ్చయ్యను శుక్రవారం స్థానిక ఎస్సై పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నాటు సారాతో పాటు మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన లచ్చయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.